క్లుప్తంగా

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

ధారూరు: ఆంజనేయస్వామి దేవాలయంలో దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. రెండో రోజైన గురువారం ప్రాణప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి పాల్గొన్నారు. అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుజాత, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే

పరిగి: కాంగ్రెస్ పార్టీ గట్టుపల్లి గ్రామ నాయకులు గురువారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను చూసి పార్టీలో చేరుతున్నారని, పార్టీ అభ్యున్నతికి పాటుపడుతున్న వారికి తగిన గుర్తింపు ఉంటుందని వెల్లడించారు.

క్రికెట్ కిట్లు పంపిణీ



క్రికెట్ కిట్లు అందజేస్తున్న సర్పంచ్

కొడంగల్: చిట్లపల్లి గ్రామంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి గురువారం యువకులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు.

ఈ రోడ్డుకు మరమ్మతు చేయించరూ..



గొడుగోనిపల్లి-దొంగఎన్కేపల్లి బీటీరోడ్డు

దోమ: గొడుగోనిపల్లి గ్రామం నుంచి దొంగ ఎన్కేపల్లి గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు అధ్వానంగా తయారైంది. కంకర తేలి, గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గొడుగోనిపల్లి నుంచి దోర్నాల్‌పల్లి, దొంగఎన్కేపల్లి చేరుకోవాలంటే 5 కి.మీ. దూరం ఉంటుందని, రోడ్డు పూర్తిగా కంకర తేలి ఉండడంతో నడవటానికి కూడా ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పాంబండపై నంది విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం చేస్తున్న పూజారులు

కుల్కచర్ల: బండవెల్కిచర్ల శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో గురువారం నంది విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయంలో హోమం నిర్వహించారు. ఇదిలా ఉండగా దేవాదాయ శాఖ అధికారులు దాతల సహకారంతో కార్యక్రమం నిర్వహించగా.. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంతో వేడుక సాదాసీదాగా జరిగిందని స్థానికులు తెలిపారు.

ఆర్థిక సహాయం

పూడూరు: కంకల్ గ్రామంలో చెర్లగుడెం మల్లేశ్ మృతి చెందగా.. మృతుడి కుటుంబాన్ని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్ బూనేటి పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అనీల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



పెద్దేముల్: దశాబ్ది ఉత్సవాలకు ముస్తాబైన తహసీల్దార్ కార్యాలయం



తాండూరు టౌన్: విద్యుత్ దీపాలతో మున్సిపల్ కార్యాలయం

పల్లెపల్లెన దశాబ్ది సంబురాలు

ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పల్లెలు, పట్టణాల్లో పండగ వాతావరణం నెలకొంది. సంబురాల్లో భాగంగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాలకు పచ్చని మామిడి తోరణాలు కట్టి, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన పార్టీ జెండాలతో పార్టీ ఆఫీసులు, ప్రధాన రహదారులు, కూడళ్లు గులాబీ మయంగా మారాయి.



కుల్కచర్ల: అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: నేటి నుంచి జరిగే తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నుంచి 21రోజుల పాటు వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కావున సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

జాతీయ జెండాను ఎగురవేయాలి

తాండూరు రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద శుక్రవారం జాతీయ జెండాను ఎగుర వేయాలని ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి జీపీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద పతాకాన్ని ఆవిష్కరించాలని వెల్లడించారు.



తాండూరు టౌన్: పోలీస్ స్టేషన్

కొడంగల్‌లో..

కొడంగల్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉదయం 8 గంటలకు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారని.. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాస్ గురువారం ప్రకటనలో తెలిపారు.

పోలీసుశాఖ ఆధ్వర్యంలో..

అనంతగిరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 4న నిర్వహించే సురక్ష దినోత్సవం, 12న నిర్వహించే తెలంగాణ రన్ కార్యక్రమాలు పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

పెద్దేముల్: ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం జరిగింది. మారేపల్లిలో మూడు రోజులుగా సాగుతున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం తెల్లవారు జాము నుంచే ఆలయం వద్ద హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులచే ఆలయం ఎదుట 33 ఫీట్ల ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఉత్సవ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్ మహరాజ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభరాణి, తాండూరు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్‌లు జితేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రుక్మాపూర్ మాజీ సర్పంచ్ రమేష్ కుమార్, దేష్‌ముఖ్ నరేష్‌రెడ్డి, మారేపల్లితండా సర్పంచ్ పాండు తదితరులు పాల్గొన్నారు.



జేసీబీ సహాయంతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

దైవకార్యక్రమాలతో గ్రామం సుభిక్షం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్సీ పట్నం, ఎస్‌కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొండల్‌రెడ్డి తదితరులు

మర్పల్లి: ఊరడమ్మ దేవతామూర్తి విగ్రహప్రతిష్ఠాపనోత్సవం గురువారం మొగిలిగుండ్ల గ్రామంలో ఘనంగా జరిగింది. వేడుకలో మాజీమంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఊరడమ్మ ఆలయం తొలగించి, పునర్నిర్మించుకొని విగ్రహాన్ని ప్రతిష్ఠించిన గ్రామస్తులను ఆయన అభినందించారు. దైవకార్యక్రమాలు చేపడితే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, మండల ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, పంతులుబాయి శ్రీనివాస్, మండల నాయకులు కృష్ణారెడ్డి, జైపాల్, ప్రవీణ్‌గౌడ్, బలరాంగౌడ్, లక్ష్మణ్, లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలు విరాళం

మర్పల్లి: ఊరడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఎస్‌కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొండల్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మహేందర్‌రెడ్డిని, కొండల్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా తమ ట్రస్ట్ ద్వారా కొండల్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు.

రైతు వేదికలను అలంకరించండి

- రైతు దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి
- ఎంపీడీఓ శైలజారెడ్డి

మోమిన్‌పేట: రైతుల వేదికలను పూలతో, మామిడి తోరణాలతో అందంగా అలంకరించాలని ఎంపీడీఓ శైలజారెడ్డి చెప్పారు. గురువారం మోమిన్‌పేట మండలం కేసారం రైతు వేదికలను ఆమె పరిశీలించి మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 30వ తేదిన రైతు దినోత్సవం జరుపుకోవాలన్నారు. ప్రతి గ్రామం నుంచి రైతులను రైతు వేదికలకు రప్పించాలని, పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై అన్నదాతలు రావాలని, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించాలని నిర్వాహకులకు చెప్పారు. ప్రతి రైతు వేదికలో సుమారుగా వెయ్యి మంది రైతులు ఉండాలని, సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ చూపించి సంబురాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. శుక్రవారం (నేడు) ప్రతి జీపీలో జాతీయ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి సందేశాన్ని చదవాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఏపీఎం రాజు, ఏఈఓ శ్రీనివాస్, కార్యదర్శి ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కేసారం రైతు వేదికను సందర్శించిన ఎంపీడీఓ శైలజారెడ్డి

ఆడటం.. ఆడించడం తెలుసు

- ఆసక్తికరంగా మారిన పట్నం రినీష్‌రెడ్డి వ్యాఖ్యలు
- పీఎంఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

యాలాల: 'ఆట ఇప్పుడే మొదలైంది. ఆడటం తెలుసు.. ఆడించడం తెలుసు' అంటూ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తనయుడు రినీష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపాయి!. కొంత కాలంగా తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిల మధ్య కోల్డ్‌వార్ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఒకే పార్టీలోని నాయకులు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం విధితమే. కాగా గురువారం యాలాల మండలం రాఘవపూర్, బషీరాబాద్ మండల కేంద్రం, పెద్దేముల్, గౌతాపూర్‌లో నిర్వహించిన పీఎంఆర్ క్రికెట్ టోర్నీని రినీష్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు యాలాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనపై విధంగా మాట్లాడడంతో.. ఇక నుంచి రాజకీయాలలో తండ్రి మహేందర్‌రెడ్డి, తల్లి జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో తాను కూడా ఉంటాననే సందేశాన్ని కార్యకర్తలకు పంపినట్లయింది. గతంలో లేని విధంగా.. ఆరుగురు బౌన్సర్లు, భారీ కాన్వాయ్, పలువురు సీనియర్ నాయకులతో రినీష్ టోర్నీ ప్రారంభానికి రావడం చర్చనీయాంశంగా మారింది.

క్రీడాణిముత్యాలను గుర్తించేందుకే టోర్నీ

బషీరాబాద్/ పెద్దేముల్/ తాండూర్ రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాణిముత్యాలను గుర్తించేందుకు తన వంతుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు రినీష్‌రెడ్డి చెప్పారు. గురువారం యాలాల మండలం రాఘవపూర్, బషీరాబాద్, పెద్దేముల్, తాండూరు మండలం గౌతాపూర్‌లో రినీష్‌రెడ్డి టోర్నీని బ్యాటింగ్‌చేసి ప్రారంభించి మాట్లాడారు. పల్లెల్లో మెరుగైన ఆటగాళ్లు ఉన్నారని, ప్రముఖ క్రికెటర్ ధోనీ మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన వాడేనని గుర్తుచేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ సహనంతో క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు.



యాలాల: కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న పట్నం రినీష్‌రెడ్డి

తెలంగాణలో అభివృద్ధి శూన్యం!

- విద్యార్థులను మోసం చేసిన కేసీఆర్
- సోనియాగాంధీకి కృతజ్ఞతలు చెప్పాలి
- డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: తెలంగాణ వచ్చి పదేళ్లవుతున్నా రాష్ట్రంలో అభివృద్ధి ఏమీ జరగలేదని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఆవశ్యకతను గుర్తించి, తెలంగాణ కలను నిజం చేసిన సోనియాగాంధీకి కృతజ్ఞతలు చెప్పాలన్నారు. నాడు విద్యార్థుల ఉద్యమాలు, బలిదానాలు చూసి చలించిన ఆమె.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందని తెలిసికూడా.. హైదారాబాద్‌తో కూడిన రాజధానిగా తెలంగాణను ప్రకటించారని వెల్లడించారు. రాష్ట్రం వచ్చి 9 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పటికీ అభివృద్ధి ఎక్కడా జరగలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని హక్కున చేర్చుకుని, తెలంగాణ కోసం కొట్లాడిన వారికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. పోరాటంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థి లోకానికి కేసీఆర్ మాయమాటలు చెప్పి మోసం చేశారని విమర్శించారు.

కేసీఆర్ చేతిలో నష్టం..

రాష్ట్రంలో లక్షల్లో ఉద్యోగ ఖాళీలు ఉన్నా.. వాటిని భర్తీచేయకుండా సీఎం కేసీఆర్ నిరుద్యోగులను అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నాడు ఆంధ్ర పాలకుల చేతిలో తెలంగాణ మోసపోతే.. ఇప్పుడు కేసీఆర్ చేతుల్లో నష్టపోతుందని తీవ్ర విమర్శలు చేశారు. ప్రతి ఎకరాకు నీళ్లందిస్తామని చెప్పి.. కాళేశ్వరం కట్టి చేతులు దులుపేసుకున్నారన్నారు. ప్రస్తుత పంటలకు సాగునీరు అందుతున్నాయంటే అది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ప్రాజెక్టుల వల్లేనని స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిదేళ్లు గడిచినా.. అభివృద్ధి చేయకుండానే.. అభివృద్ధి చేసినట్టుగా ప్రజలకు చెప్పేందుకే ఉత్సవాలు జరుపుకొంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఏం సాధించారని ఉత్సవాలు

కొడంగల్: తెలంగాణలో ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్ కుటుంబం రుణపడి ఉండాలన్నారు. ఎంతో మంది ఉద్యమకారులు పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే లబ్ధి పొందుతుందని ఆరోపించారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఆ కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, మైనార్టీ నాయకుడు నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

మర్పల్లి: నూతనంగా ఏర్పాటైన గ్రామపంచాయతీని దశల వారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని సర్పంచ్ సాలీబాయి అన్నారు. గురువారం శాపూర్‌తండాలో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.5 లక్షల నిధులతో ఫార్మేషన్ రోడ్డు పనులను సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. ఈ రోడ్డు పనులు పూరైతే పొలాలకు వెళ్లే రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతుబంధు గ్రామ కమిటీ అధ్యక్షుడు సుభాష్, తండా వాసులు మోహన్, విఠల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గ నియామకం



శాంతిబాయి

బషీరాబాద్: బషీరాబాద్ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. చైర్‌పర్సన్‌గా వాల్యానాయక్‌తండాకు చెందిన రాథోడ్ శాంతిబాయిని నియమిస్తూ ఏపీసీ, ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌గా మంతట్టి గ్రామానికి చెందిన బోయిని కృష్ణను నియమించారు. కమిటీ సభ్యులుగా శివరామ్, భానుచందర్, నర్సమ్మ, జగన్నాథ్‌రావు, మధుసూదన్‌గౌడ్, చంద్రశేఖర్, రాములు, లక్ష్మయ్య, మహమ్మద్ ఫకీర్ అహ్మద్, పాండురంగా, వెంకట్‌రామ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఏడీఏ తాండూరు, అలాగే బషీరాబాద్ సర్పంచ్ ప్రియాంకను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి

షాబాద్: గొర్రెలు, మేకల్లో చిటుకు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని రేగడిదోస్వాడ గ్రామంలో జీవాలకు చిటుకు వ్యాధి నివారణ టీకాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెలు, మేకల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిటుకు వ్యాధి నివారణ రెండు సార్లు టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'

కుల్కచర్ల: అంధత్వ నివారణ కోసమే కంటివెలుగు కార్యక్రమం అని రాంరెడ్డిపల్లి సర్పంచ్ సత్తయ్య అన్నారు. గురువారం రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు నేత్ర శిబిరాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి సైతం ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దామోదర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ సత్తయ్య తదితరులు

గ్రంథాలయాలతో మేధస్సు మెరుగు



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు, సర్పంచ్ స్వరూప

షాబాద్: గ్రంథాలయాలతో మేధస్సు మెరుగు పడుతుందని ఎంపీడీఓ అనురాధ, సర్పంచ్ స్వరూప అన్నారు. గురువారం మండలంలోని సర్దార్‌నగర్ గ్రామంలో సెర్చ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేదస్సును పెంపొందించి, మనిషి మనుగడను మార్చేవే పుస్తకాలు అని చెప్పారు. గ్రంథాలయాలు మేధాశక్తిని పెంచుకునేందుకు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. ఎక్కడా దొరకని పుస్తకాలు లైబ్రరీల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహులు, ఎంపీటీ హన్మంత్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు శంకర్, పార్థసారథి, అవినాశ్, సురేష్, సుధాకర్, నవీన్, ఉపసర్పంచ్ ఇందిర, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వార్డు సభ్యులు రామ్మోహన్, చంద్రశేఖర్, రఘు, హరీష్, కుమార్, కృష్ణాజీ, అశోక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ సభ్యత్వాన్ని తొలగించాలి

పరిగి: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో ఎంపీకి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన మల్లయోధులపై కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని, లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీని అరెస్ట్ చేసి, లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యాదగిరి, రాంచంద్రయ్య, ఎల్లప్ప, ప్రశాంత్, నర్సింహులు, గోరెమియా తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బీఎస్పీతోనే సమన్యాయం

కొందుర్గు: బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని ఆ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. గురువారం కొందుర్గు మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు ఏకమై బీఎస్పీని అధికారంలోకి తేవాలని పిలుపునిచ్చారు. బీఎస్పీ కొందుర్గు మండల ఉపాధ్యక్షుడు రాజేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణకు ఘన సన్మానం

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన చేవెళ్ల మండలం నాంచేరి గ్రామానికి చెందిన నారాయణను బీఆర్ఎస్, సీఐటీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం నగరంలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో నారాయణకు ప్రమాణస్వీకారం చేశారు. చేవెళ్ల ప్రాంతానికి చెందిన నారాయణకు పదవి రావడం సంతోషంగా ఉందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బి.రవీందర్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్, సర్పంచులు నరహరి రెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.